పోలింగ్‌కు సర్వం సిద్ధం

ముగిసిన ప్రచారం... ఆ 36 గంటలపై పోలీసుల స్పెషల్ ఫోకస్

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రెండు నెలలుగా హోరెత్తిన ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6గంటలతో ముగిసింది. రోడ్‌షోలు, బస్సు యాత్రలు, ర్యాలీలు, పాదయాత్రలు తదితర కార్యక్రమాలతో సందడిగా ఉన్న గ్రేటర్‌లో ప్రచార పర్వం ముగియడంతో ఒక్కసారిగా వీధులన్నీ మూగబోయాయి. ట్రై కమిషనరేట్ పరిధిలోని పోలీసులు సైతం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన బందోబస్తుపై దృష్టి పెట్టారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో ఇక రానున్న ఆ 36 గంటలపై ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా ఓటర్లను ఆకర్షించి, ఓట్లు కొనుగోలు చేసేందుకు ఆయా రాజకీయ పార్టీలు కుట్ర చేసే అవకాశాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. డబ్బులు పంపిణీ చేయడం, మద్యం, ఆకర్షనీయమైన వస్తువులు వంటివి పంపిణీ చేయకుండా నిఘా విభాగం సూక్ష్మదృష్టితో నాయకుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తోంది. ఓట్ల కోసం కుల సంఘాలు, బస్తీ, కాలనీ సంఘాలు, అసోసియేషన్‌లతో ఆయా రాజకీయ పార్టీలు ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలుండటం పై పోలీసులు నజర్ పెట్టారు. ఎక్కడ కూడా ఓటర్లను ఆకర్షించే యత్నాలు జరగకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నట్లు మూడు కమిషనరేట్ల పోలీసు కమిషనర్లు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి తెలిపారు. మూడు కమిషనరేట్ల పరిధిలోని అన్ని పోలింగ్ లొకేషన్‌లు, పోలింగ్ స్టేషన్‌ల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు కమిషనర్లు వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర బలగాలతో ప్రత్యేక భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై మూడు కమిషనరేట్ల అధికారులు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, విధి విధానాలపై చర్చించారు. ముఖ్యంగా ఎన్నికలు సజావుగా సాగేలా అన్ని పోలింగ్ స్టేషన్‌లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా చర్యలు, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈవీఎంల తరలింపు, పోలింగ్‌కు ముందు రోజు డబ్బులు, మద్యం వంటివి పంపిణీ జరగకుండా చూడటం తదితర అంశాలపై చర్చించారు.

మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

11.9 కోట్లు సీజ్..

ఎన్నికల నేపథ్యంలో జరిపిన తనిఖీల్లో కమిషనరేట్ పరిధిలో మొత్తం రూ.11.9కోట్ల నగదు, రూ.75.78లక్షల విలువ చేసే 12,240 లీటర్ల మద్యం, రూ.1.95కోట్ల విలువైన డ్రగ్స్ తదితరాలను సీజ్ చేసినట్లు సీపీ వెల్లడించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 8 అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు, 29 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 25 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు.

6 వేల మంది పోలీసులతో భద్రత ..

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 6వేల మంది పోలీసు బలగాలతో భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీసు కమిషనర్ తరుణ్‌జోషి వెల్లడించారు. ఎన్నికల బందోబస్తుపై శనివారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో మొత్తం 5 పార్లమెంట్ నియోజక వర్గాలున్నట్లు తెలిపారు. 1590 పోలింగ్ లొకేషన్‌లు, 3,396 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా వాటిలో 188 సమస్యాత్మక లొకేషన్‌లు, 533 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను గుర్తించామని, 328 రూట్స్, 8 డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కలెక్షన్ సెంటర్స్, మూడు స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 35,27,441మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

సొంతూళ్లకు వెళ్తున్న ఓటర్లు..

కిక్కిరిసిపోతున్న బస్, రైల్వే స్టేషన్లు

ట్రావెల్ బస్సులను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): ఎన్నికల వేళ జనం సొంతూళ్లకు వెళ్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి సీమాంధ్రులు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు బయలుదేరుతుండటంతో బస్, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో శనివారం కిక్కిరిసిపోయాయి. మరోవైపు ట్రావెల్ బస్సులు కూడా కిటకిటలాడాయి. టికెట్స్ మొత్తం బుక్ అవుతుండటంతో చాలా మంది సొంత వాహనాల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్-విజయవాడ మధ్య భారీగా ట్రాఫిక్ జామ్ సమస్య నెలకొంటుంది. ఉద్యోగ, ఉపాధి కోసం ఇక్కడ ఉండి.. ఐదేళ్లకోసారి తమకు ఇష్టమైన నాయకుడికి ఓటు వేసేందుకు ఉత్సాహంగా సొంతూళ్లకు వెళుతుంటారు. వారాంతం కావడంతో పాటు వరుస సెలవుల నేపథ్యంలో తరలివెళ్లారు. జాతీయ రహదారులపై రద్దీ నేపథ్యంలో నగర శివారు హయత్‌నగర్ నుంచి అబ్దుల్లాపూర్ మెట్ వరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. అటు చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా అందుబాటులో ఉంచింది. దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక రైళ్లను నడుపుతుంది. ఇదిలా ఉండగా పది రోజుల ముందరే బస్సులు, రైళ్లలో సీట్లన్నీ బుక్ చేసుకున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని టీఎస్ ఆర్టీసీ 2వేల బస్సులను కేటాయించింది. ఎంజీబీఎస్ నుంచి 500, జేబీఎస్ నుంచి 200, ఉప్పల్ నుంచి 300, ఎల్బీనగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. బస్సుల్లో సీట్లు లేకపోవడంతో చాలా మంది ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నారు. ఫైర్ సేఫ్టీ, ఇద్దరు డ్రైవర్లు, ఫిట్‌నెస్ తదితర వాటిపై ఆరా తీస్తున్నారు. మరోవైపు గన్నవరం విమానాశ్రయం శుక్రవారం సాయంత్రం నుంచి రద్దీగా మారింది. హైదరాబాద్, బెంగళూరు నుంచి చాలా మంది ఓటర్లు విమానాల్లో ప్రయాణానికి ఆసక్తి చూపిస్తున్నారు.

రూ. 23.19 కోట్ల నగదు స్వాధీనం

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇప్పటి వరకు రూ.23.19 కోట్ల నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. రూ. 25.97 కోట్ల విలువ గల ఇతర వస్తువులు, 27,357.605 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. 327 మందిపై కేసులు నమోదు చేసి 320 మందిని అరెస్ట్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 690 ఫిర్యాదులు రాగా.. వాటిని పరిష్కరించారని, 444 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గడిచిన 24 గంటల వ్యవధిలో రూ. 34,28,500 నగదు, రూ.6 కోట్ల 54 లక్షల 77వేలను విలువ జేసే వస్తువులను పట్టుకొని సీజ్ చేశామని కమిషనర్ తెలిపారు.

భవనం పై నుంచి జారిపడి..

వెంగళరావునగర్, మే 11: నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తు నుంచి జారిపడి సెక్యూరిటీ గార్డ్ మృతి చెందాడు. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సెక్యూరిటీ గార్డ్ సుమీత్ కుమార్(30) జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నాడు. మధురానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనానికి క్యూరింగ్ కోసం రూ.2 వేల వేతనంతో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మూడో అంతస్తులో క్యూరింగ్ చేస్తుండగా..అక్కడి నుంచి జారి కిందపడ్డాడు. వెంటనే దవాఖానకు తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్లాబ్‌కు రెయిలింగ్ లేకపోవడంతో పాటు పని చేసే వారికి ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించని భవన యజమాని పై ఐపీసీ సెక్షన్ 304ఏ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- నగదు, మద్యం, ఉచితాల పంపిణీపై దృష్టి పెట్టాలి
- లాడ్జీలు, కళ్యాణ మండపాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
- పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు
- నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 11(నమస్తే తెలంగాణ): ఈనెల 13న జరిగే పోలింగ్ రోజు పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కృషి చేయాలని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి శనివారం గోషామహల్ శివకుమార్‌లాల్ పోలీస్ స్టేడియం, పేట్లబుర్జ్‌లోని కార్ హెడ్‌క్వార్టర్స్‌లో కమాండెంట్ హోంగార్డులు, ఎన్నికల విధుల కోసం కర్ణాటక నుంచి వచ్చిన హోంగార్డ్‌లు, ప్రత్యేక పోలీసు అధికారులు, టీఎస్-న్యాబ్, టీఎస్ఐసీసీసీ, ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ వింగ్, సీసీఎస్ అధికారులతో వేర్వేరుగా నిర్వహించిన శిక్షణ, బ్రీఫింగ్ సెషన్ కార్యక్రమాల్లో సీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న 48 గంటలు, పోలింగ్ రోజు అనుసరించాల్సిన విధి విధానాలపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా అక్రమ మద్యం, నగదు, ఉచితాలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, లాడ్జీలు, కల్యాణ మండపాలు తదితరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. క్యూ లైన్ల నిర్వహణ, పోలింగ్ సిబ్బంది వినతులపై పోలీసులు సత్వరంగా స్పందించాలని, 100 మీటర్లు, 200 మీటర్లకు సంబంధించిన సూచనలు తప్పక పాటించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతా విషయాలపై సిబ్బందికి మరోసారి అవగాహన కల్పించారు. ప్రజా రవాణా, ప్రైవేట్ రవాణా దుర్వినియోగం చేస్తూ ఓటర్లను రవాణా చేయడాన్ని అనుమతించవద్దని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లలో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటర్లు ఎక్కువ క్యూలో ఉన్నట్లయితే, ప్రిసైడింగ్ అధికారి సూచనలు మరియు టోకెన్‌ల జారీ ఆధారంగా, ఓటర్లు తమ ఓటు వేయడానికి అనుమతించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులతో మాత్రమే బూత్ లెవల్ ఆఫీసర్లను పోలింగ్ స్థానాల్లోకి అనుమతించాలని, పోలింగ్ కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్లను అనుమతించవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వివిధ విభాగాలకు చెందిన సుమారు 8 వేల మంది పోలీసు సిబ్బంది, అదనపు సీపీలు, హెడ్ క్వార్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శనివారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ నేతృత్వంలో ఆయన చాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ మూడో ర్యాండమైజేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్ సాధారణ పరిశీలకులు పీఐ శ్రీవిద్య, డాక్టర్ సరోజ్‌కుమార్ సమక్షంలో ర్యాండమైజేషన్‌ను నిర్వహించారు. జిల్లాలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీ ఓలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడుతలుగా మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు డీఈఓ పరిశీలకులకు తెలిపారు. జిల్లాలోని 15 అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలో మొత్తం 3986 పోలింగ్ కేంద్రాలకు టీమ్‌లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్వో అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్, కంటోన్మెంట్ ఆర్వో మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్

పెంపుడు తల్లి కర్కశత్వం

బాలికను వ్యభిచారంలోకి దింపిన మహిళ అరెస్టు

బంజారాహిల్స్, మే 11: కన్నకూతురిలా పెంచుకుంటున్నానంటూ అందరినీ నమ్మించింది. స్కూల్‌కు పంపిస్తూ చదువు చెప్పిస్తుంటే మా అమ్మ బంగారం అనుకుని ఆ చిన్నారి మురిసిపోయింది. తల్లిలా నటిస్తూనే 14 ఏళ్ల బాలికను వ్యభిచారంలోకి దింపి డబ్బులు దండుకుంటున్న ఓ మహిళను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న పి.లక్ష్మి(38) భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. కొన్నేళ్లుగా సినీ పరిశ్రమలో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తోంది. ఆరు నెలలు ఉన్న చిన్నారిని పెంచుకునేందుకు తెచ్చుకుంది. అప్పటి నుంచి కన్నకూతురు కంటే ఎక్కువగా చూసుకుంటోంది. జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తూ పలువురు వ్యక్తులతో పరిచయాలు పెరగడం, జల్సాలకు అలవాటుపడటంతో పడుపు వృత్తిలోకి ప్రవేశించింది. తనతో పాటు మరికొంతమంది మహిళలతో కలిసి వ్యభిచార గృహం నడిపిస్తోంది. కాగా తాను పెంచుకుంటున్న బాలిక రెండేళ్ల క్రితం రజస్వల అవ్వగానే లక్ష్మి మనసులో చెడు ఆలోచనలు ప్రవేశించాయి. తన కుమార్తెను వ్యభిచారంలోకి దింపేందుకు ప్రయత్నించగా ఆమె అంగీకరించలేదు. దీంతో రోజూ కొట్టడం, శరీరంపై వాతలు పెట్టడం చేస్తుండేది. స్కూల్‌కు వెళ్లకుండా మాన్పించేసింది. బయటకు వెళ్తానంటే జుట్టు కత్తిరించి అందవిహీనంగా తయారు చేసింది. చిన్నప్పటినుంచి లక్ష్మి తప్ప వేరేవాళ్లు తెలియదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో బాలిక(14) వ్యభిచార కూపంలోకి దిగింది. ఈ క్రమంలో ఇటీవల టాస్క్ ఫోర్స్ పోలీసులు లక్ష్మి ఇంటిపై దాడి చేయగా మరో ఇద్దరు మహిళలతో కలిసి బాధిత బాలిక(14) పట్టుబడింది. ఆమెను భరోసా సెంటర్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వగా లక్ష్మి చేసిన దారుణాలు బయటపడ్డాయి. బాలిక ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా లక్ష్మి పై జువైనల్ జస్టిస్ యాక్ట్‌తో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను రక్షించి శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

పీడించడంతోనే ప్రాణాలు తీశా..

సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీ రవికుమార్ హత్య కేసు నిందితుడు చంద్రమౌళి

అధిక వడ్డీలతో అసలుకు మూడింతలు వసూలు చేసినా ఆగని వేధింపులు

అప్పు ఇంకా తీరలేదంటూ అందరి ముందు అవమానించడంతోనే హత్య

రవికుమార్ హత్యకేసును ఛేదించిన మధురానగర్ పోలీసులు

వెంగళరావునగర్, మే 11: అవసరానికి రూ.5 లక్షలు అప్పు తీసుకున్నా..రూ.15 లక్షలు వరకు తిరిగి చెల్లించా..అప్పు ఇంకా రూ.3 లక్షలు మిగిలి ఉందని..బాకీ తీర్చాలని అందరి మందు అవమానించడంతోనే సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీ రవికుమార్‌ను చంపేశానని నిందితుడు చింతకుంట చంద్రమౌళి అలియాస్ చంద్రారెడ్డి పోలీసుల ఎదుట తన నేరాన్ని అంగీకరించాడు. బుధవారం ఎల్లారెడ్డిగూడ ఇంజినీర్స్ కాలనీ ప్రిజ్జీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్లోని ఫ్లాట్‌లో పట్టబగలు జరిగిన సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీ కొత్తగుల్ల రవికుమార్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీగా పని చేసిన రవికుమార్ యూసుఫ్‌గూడలోని వెంకటగిరిలో నివాసం ఉండేవారు. రవికుమార్ ఫ్యాకల్టీతో పాటు వడ్డీ వ్యాపారాన్ని కూడా నిర్వహించేవారు. పొరుగింట్లో కడప జిల్లాకు చెందిన సినిమా ప్రొడక్షన్‌లో మేనేజర్‌గా పనిచేసే చింతకుంట చంద్రమౌళి అలియాస్ చంద్రారెడ్డి (47) నివాసం ఉండేవారు. మూడేళ్ల క్రితం రవికుమార్ వద్ద చంద్రమౌళి రూ.5 లక్షలను రూ.15 వడ్డికి తీసుకున్నారు. ఇప్పటి వరకు ఆ రూ.5 లక్షల అప్పుకు రూ.15 లక్షల వరకు చెల్లించాడు. అప్పు ఇంకా తీరలేదని..రూ.3 లక్షలు అప్పు మిగిలి ఉందని, బాకీ తీర్చలేనోడివి ఎందుకు తీసుకున్నావంటూ సినిమా షూటింగ్ సెట్ల వద్దకు వచ్చి పలుమార్లు అవమానాలకు గురి చేశాడు రవికుమార్. దీంతో రవికుమార్ పై పగతో రగిలి పోయిన చంద్రమౌళి చంపాలని పథకం పన్నాడు. పథకాన్ని అమలు చేసేందుకు నెల రోజుల క్రితం ఎర్రగడ్డ ఆదివారం సంతలో ఇనుప సుత్తితో పాటు ఓ కత్తిని కొనుగోలు చేశాడు. నెల రోజుల నుంచి మూడు సార్లు రవికుమార్ ఇంటి వద్దకు వెళ్లేందుకు చంద్రమౌళి పలుమార్లు ప్రయత్నించాడు. బుధవారం సాయంత్రం రవికుమార్ భార్య కె.అశ్విని అలియాస్ శ్రావణి తన కుమార్తెతో కలిసి వాకింగ్‌కు వెళ్లారు. ఇంటి తలుపులను బయట నుంచి గడియ పెట్టి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా రవికుమార్ ఉండటాన్ని అదునుగా భావించిన చంద్రమౌళి ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. కాలికి గాయంతో ఇంట్లోనే హాల్‌లో దివాన్ పై నిద్రపోతున్న రవికుమార్ వద్దకు వెళ్లాడు. రవికుమార్ ముఖం పై దిండును అదిమిపట్టి..బ్యాగులోని సుత్తిని బయటకు తీసి అతని తల పై బలంగా పలుమార్లు మోదాడు. దీంతో రవికుమార్ తలపగిలి మెదడు బయటకు వచ్చి.. అక్కడికక్కడే మృతి చెందాడు. ఆధారాలు దొరక్కుండా పసుపు, కారం చల్లాడు. దాడికి ఉపయోగించిన సుత్తిని తన బ్యాగులో తీసుకుని పారిపోయాడు. అరగంట తర్వాత వాకింగ్ నుంచి తిరిగొచ్చిన రవికుమార్ భార్య శ్రావణి చూసి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హతుడి స్వస్థలం ఏపీ కృష్ణా జిల్లా గంపలగూడేంతో పాటు పలు ప్రాంతాలకు పోలీసు బృందాలు చేరుకుని దర్యాప్తు ప్రారంభించాయి.

నిందితుడిని పట్టించిన సీసీటీవీ ఫుటేజ్..

సాఫ్ట్ వేర్ ఫ్యాకల్టీ రవికుమార్ హత్య కేసులో నిందితుడు చంద్రమౌళి విజువల్స్ అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. బ్యాగులో రవికుమార్ ఫ్లాట్ వద్దకు రావడం..అపార్ట్‌మెంట్ ముందు అతను పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం నంబర్ అధారంగా పోలీసులు కేసు మిస్టరీని ఛేదించారు. ద్విచక్ర వాహనం నంబర్ యజమాని ఇంటి చిరునామా ఆధారంగా చంద్రమౌళి ఇంటికి పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని మధురానగర్ పోలీసు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. నిందితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళా సంఘాల దౌర్జన్యం..

బంజారాహిల్స్,మే 11: వరకట్న వేధింపులకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించుకోవాలంటూ ఓ వైద్యురాలి ఇంట్లోకి మహిళా సంఘాల సభ్యులతో వచ్చి బెదిరింపులకు గురిచేసిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న ఓ వైద్యురాలి తమ్ముడికి, మరదలుకు మధ్య విభేదాలు తలెత్తాయి. తనను వేధింపులకు గురిచేస్తున్నాడంటూ భర్తపై కేసు పెట్టడంతో పాటు విడాకులకు దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 8 మంది మహిళా సంఘాల సభ్యులమంటూ తన ఇంటికి వచ్చి దౌర్జన్యం చేశారని వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్యాభర్తల వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా తనను వేధింపులకు గురిచేస్తున్నారని, ఇంట్లోకి దౌర్జన్యంగా వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మార్చి 7న కూడా ఓ న్యాయవాది అనుమతి లేకుండా నలుగురు గూండాలతో తమ ఇంట్లోకి వచ్చి బెదిరించాడని, రూ.15కోట్లు ఇచ్చి మ్యాటర్ సెటిల్ చేసుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ మేరకు ఐపీసీ 448, 506 రెడ్ విత్ 34 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు డోర్‌లో గంజాయి స్మగ్లింగ్

గంజాయితో పట్టుబడిన నిందితులు

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): ఒడిశా కేంద్రంగా కారు డోర్‌లో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠా గుట్టును ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గుట్టు రట్టు చేశారు. ఆబ్కారీ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్ర, ముంబైకి చెందిన వినోద్, శివ, సలీం ఆయూబ్ స్థానికంగా చిరువ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి స్మగ్లింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో వీరికి హైదరాబాద్‌కు చెందిన వెంకట్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న అటవీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి, వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ఇటీవల పోలీసుల నిఘా పెరగడంతో గంజాయి స్మగ్లర్లు ఎవరికీ అనుమానం రాకుండా కారు డోర్‌లో పెట్టి రవాణా చేయాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా జూమ్ కంపెనీకి చెందిన కారును అద్దెకు తీసుకొని కారు డోర్లు విప్పదీసి, ఆ డోర్ ఫైబర్ ప్లేట్స్‌లోపల గంజాయి ప్యాకెట్లను కుక్కి, మళ్లీ ఎప్పటిలా డోర్‌లను కార్‌కు బిగించారు. అనంతరం ఆ కారు తీసుకుని యథేచ్ఛగా నగరానికి గంజాయి రవాణా చేస్తున్నారు. ఈ మేరకు పక్కా సమాచారం అందుకున్న ఆబ్కారీ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఘట్‌కేసర్ పరిధిలోని వరంగల్-హైదరాబాద్ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జూమ్ కారును ఆపి సోదా చేయగా కారులో ఎలాంటి మత్తు పదార్థాలు కనిపించలేదు. అయితే ముందస్తు సమాచారం ఉండటంతో పోలీసులు కారులో ఉన్న మహ్మద్ సలీం ఆయూబ్‌షేక్, వెంకట్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా కారు డోర్‌లోపల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు అంగీకరించారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.6.5లక్షల విలువ చేసే 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ఈ దాడుల్లో అదనపు ఎస్సీ బి.భాస్కర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ కె.నవీన్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెక్కును ఫోర్జరీ చేసి.. డబ్బులు తస్కరించే యత్నం

ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

క్రెటా కారుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

సుల్తాన్‌బజార్, మే 11: ఓ వ్యాపారి పేరిట ఉన్న చెక్కును ఫోర్జరీ చేసి రెండు కోట్లు కొల్లగొట్టేందుకు యత్నించిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ మేరకు నిందితుల వద్ద నుంచి క్రెటా కారు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సెనగల్ల శ్రీనివాస్ రెడ్డి (30), జెల్లి నగేశ్ (43), పార్టీ వెంకటేశ్వర్ రావు (46), యుకుంట హరిక్రిష్ణ (34), ఖమ్మం జిల్లాకు చెందిన కంభంపాటి వెంకట రఘునాథరావు(53), బేగంపేటకు చెందిన నూనె హరికృష్ణ (50), మహ